ఆర్‌డిటి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం ఏప్రియల్ 2006

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

### రసాయనిక ఎరువులు లేకనే పండించగల 'వరి'

తమిళనాడులోని కాంచీపురం జిల్లా పుదుప్పాకంలోని జె.ఫారం అనే వ్యవసాయ ఫారంలో కొత్తరకం వరి వంగడాన్ని తయారు చేశారు. ఆ ఫారం సీనియర్ వైస్ ప్రసిడెంట్‌ఐన యస్.యస్. నాగరాజన్ చెప్పిన ప్రకారం, ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన వాగ్-వాగ్ రకం నుంచి అభివృద్ధి చేసిన ఈ వంగడానికి జె-16 అనే పేరు పెట్టారు. ఈ వంగడం 135 రోజులకు కోతకు వస్తుంది. గడ్డి మొదలు మందంగా ఉంటుంది. కోత సమయంలో గింజరాలదు. ముఖ్యంగా దీనికి రసాయనిక ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియపుటెరువులు వేస్తే, గడ్డి చాలా నాణ్యంగా పెరిగి పశువులు చాలా ఇష్టంగా తింటాయి. ఇది తక్కువ నీటితోనే పండించగల రకము. నీరు ఎక్కువగా లభ్యంకాని ప్రాంతాలకు ఇది చాలా అనువైనది. ఈ పైరుకు గింజరాలని లక్షణం ఉండడంవలన కూలీలు దొరకని చోట యాంత్రిక పద్ధతిలో పంటకోతలు చేపట్టినా నష్టం ఉండదు. కంకులలో గింజలు ఎక్కువగా ఉంటాయి. తోలు ఏర్పడదు.

కాంచీపురం జిల్లాలోని ఆలతూర్ గ్రామంలోని సి. రామచంద్రనాయుడు అనే ఆదర్శ రైతు తన 30 ఎకరాల పొలంలో తక్కువ నీటితో ఈ పంటను పండించాడు. జె.ఫారం వారి సాంకేతిక పర్యవేక్షణలో వరి విత్తనాలను మొలక కట్టి ఖరీఫ్ సీజనులో (జూన్, ఆగస్ట్ మాసాలలో విత్తినాడు) ఇతరత్రా వరి రకాలకైతే, నారు పోసి తిరిగినాటాల్సి ఉంటుంది. కలుపుతీసే అవసరం లేదు. రసాయనిక ఎరువులు లాంటివి, రసాయనిక పురుగు మందులు అసలు వాడలేదు. 15 ఎకరాల పంటకుగానూ 21 వేలు ఖర్చయ్యింది. దాదాపు 200 మూటలు వడ్లు అయినాయి. గింజ గట్టిగా ఉండడంవలన బియ్యంలో నూకలు రావడం లేదు. ఒక ఎకరంలోని గడ్డి అమ్మితే అయిదు వేలు ఆదాయం వస్తుంది. ఏమైనా వివరాలు కావలసివస్తే, సి. రామచంద్రనాయుడు, యాదవ స్ట్రీట్, అలతూర్ గ్రామం, కాంచీపురం జిల్లా. ఫోన్ : 9380-141721 లేదా యస్.యస్. నాగరాజన్, జె. ఫారమ్స్, పుదుప్పాక్కం పోస్టు, వయా కేలంబాకం, కాంచీపురం జిల్లా - 603 103. ఫోన్ : 044-27474348కి. వ్రాసి తెలుసుకోవచ్చు.

(హిందూ, 9-3-2006 దినపత్రిక నుండి)

**చిట్కా : ఒక చెంచా ఉల్లిరసం, అరచెంచా తేనెతో కలిపి మూడు రోజులపాటు మూడు పూటలా తీసుకుంటే దగ్గు, గొంతు నొప్పి తగ్గుతాయి.**

## ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ "సమాచార హక్కు"

గత రెండు మాసాలుగా ఎంతో ముఖ్యమైనటువంటి "ఉపాధీ హామీ చట్టాన్ని" గురించి తెలుసుకున్నాం. ఆ చట్టం తరువాత అత్యంత విలువైన చట్టం "సమాచారహక్కు". సాధారణంగా ప్రభుత్వం నుండి మనకేమైనా సమాచారం కావాలన్నప్పుడు (అది సాధారణం కావచ్చు లేదా విలువైన సమాచారం కావచ్చు) ప్రభుత్వాధికారులు "ప్రభుత్వ రహస్యాలు" అనే పేరుతో ఆ సమాచారం ఇచ్చేవారు కాదు. అయినా అక్రమ మార్గాలగుండా తెలుసుకోకూడని రహస్యాలు కూడా వ్యక్తులకు చేరిపోతున్నాయి, అది వేరే సంగతి. అయితే చట్టపరంగా, ఒక హక్కుగా సమాచారం పొందడానికి వీలయ్యేదికాదు. ఎవరికో చదువుకున్న వారికి లేదా పట్టణాల్లో ఉండే వారికే ఈ సమాచారం కావలసివస్తుందేమో, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకుంటూ మన బతుకులు మనం బతుకుతున్నవారికి ఈ చట్టంతో ఏం పని అన్న అభిప్రాయం కలుగవచ్చు కానీ అది నిజం కాదు.

ఒక చట్ట బద్ధ పాలన జరిగే వ్యవస్థలో ప్రతిదానికి ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. మనకు రెండెకరాల పొలం ఉంటే అది ప్రభుత్వ రికార్డుల్లోకెక్కుతుంది. ఒక పూరి గుడిసె ఉన్నా అది ప్రభుత్వ లెక్కల్లో ఉంటుంది. ఆఖరికి మనకు రేషను కార్డు కావాలన్నా, ఓటు హక్కు కావాలన్నా మన పేరు ప్రభుత్వ రికార్డుల్లోకెక్కుతుంది. ఆరోగ్యం బాగులేకపోతే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళతాం. ప్రభుత్వం చేపట్టే సహాయ కార్యక్రమాలు, సబ్సిడీలు - ఇలా ప్రతి ఒక్కదానిపై ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. సామాన్య మానవుడు తనకు సంబంధించిన ఆస్థి గురించో లేదా తనకు వర్తించాల్సిన ప్రభుత్వ రాయితీ గురించో ప్రభుత్వాధికారులను అడిగి తెలుసుకునే హక్కు కల్పిస్తుంది ఈ చట్టం. దీని ద్వారా అధికార యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా మారుతుంది. దీని ద్వారా మీ గ్రామంలో కరువు పనులకు ఎంత మొత్తం కేటాయించబడిందో తెలుసుకోవచ్చు. సబ్సిడీమీద విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఎవరెవరికి ఇచ్చారో తెలుసుకోవచ్చు. అతి ముఖ్యమైన ఈ చట్టాన్ని గురించి క్లుప్తంగా పరిచయం చేసుకుందాం.

ఈ సమాచర హక్కును పార్లమెంటు జూన్ 15, 2005న ఆమోదించింది. అప్పటి నుండి 120 రోజులలోపల ఈ చట్టం అమలులోకి వస్తుంది అంటే 12 అక్టోబరు 2005 నుండి ఈ చట్టం అమలులోకి వచ్చినట్లు లెక్క.

### అసలు సమాచార హక్కు అంటే ఏమిటి ?

- పనులు, పత్రాల్ని, రికార్డుల్ని తనిఖీ చేసే హక్కు లభిస్తుంది.
- పత్రాలు, రికార్డుల నుండి నకళ్ళు, సారాంశం, అందులో వ్యక్తపర్చిన అభిప్రాయాల్ని పొందడం.
- మెటీరియల్ లేదా వస్తువుల ధృవీకృత నమూనాలు తీసుకోవడం, ఆ వస్తువు నాణ్యత కలిగినదో లేదో పరిశీలించడం.
- ప్రింట్లు, డిస్కెట్లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్లు, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సమాచారం పొందడం.
- రికార్డులు, పత్రాలు, మెమోలు, ఈ-మెయిల్స్, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్కులర్లు, ఆర్డర్లు, లాగ్ పుస్తకాలు, కాంట్రాక్టులు, నివేదికలు, →

కాగితాలు, నమూనాలు, మోడల్స్, ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న గణాంకాలు, అమలులో ఉన్న చట్టప్రకారం ప్రభుత్వ అధికారి అందుబాటులో ఉండే ప్రైవేట్ సంస్థల వివరాలు వంటి వాటివన్నీ సమాచారం కిందికి వస్తాయి. (ఫైల్ నోటింగ్స్ సమాచారం కిందికి రావు) (సెక్షన్ 2, f, J)

అయితే చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఈ దిగువ సమాచారాన్ని వెల్లడిచేయాల్సిన అవసరం లేదు.

- భారత దేశ ఐక్యతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే సమాచారం. రాజ్యభద్రత, వ్యూహాత్మక శాస్త్ర, ఆర్థిక ప్రయోజనాలకు భంగంకలిగించే సమాచారం, ఇతర దేశాలతో సంబంధాలకు ముప్పుగా పరిణమించే సమాచారం, దేశంలో అంతర్గత కల్లోలాలకు దారితీసే సమాచారం.
- కోర్టు, లేదా ట్రిబ్యునల్ ద్వారా ప్రచురణకు నిషేధింపబడిన సమాచారం లేదా కోర్టు ధిక్కారం కిందకు వచ్చే సమాచారం.
- పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల హక్కులకు భంగం కలిగించే సమాచారం.
- ఇటువంటి సమాచారాన్ని వెల్లడి చేయడం ప్రజాహితానికి అవసరమని సంబంధిత అధికారి భావిస్తే తప్పించి మూడవ పార్టీ పోటీపడే స్థితిని దెబ్బతీసే వాణిజ్య రహస్యాలు, మేధో సంబంధిత ఆస్థివంటి సమాచారం.
- గోప్యంగా ఉంచుతారన్న నమ్మకంతో విదేశాల నుంచి అందుకున్న సమాచారం.
- సమాచారం వెల్లడి చేయడం ద్వారా నేరస్థులను అరెస్టు చేయడానికి విచారించడానికి, కేసు పరిశోధనకు ఆటంకంగా మారే సమాచారం.
- వ్యక్తిగత సమాచారం, దీని వెల్లడి ద్వారా ఎటువంటి ప్రజా ప్రయోజనం లేకపోగా, ఆ వ్యక్తి జీవితంలోకి అనవసరంగా ప్రవేశించినట్లయ్యే సమాచారం.
- పైన పేర్కొన్నవాటితో సంబంధం లేకుండా వ్యక్తుల ప్రయోజనానికి జరిగే హానికంటే, ఆ సమాచారాన్ని వెల్లడి చేయడం ద్వారా ప్రజా ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని అధికారి భావిస్తే అటువంటి సమాచారం వెల్లడించవచ్చు.

### సమాచారంలో కొంత భాగాన్ని మాత్రమే వెల్లడి చేయవచ్చు.

చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం వెల్లడి చేయాల్సిన అవసరం లేని సమాచారాన్ని మినహాయించి, మిగిలిన దాని నుంచి తేలికగా వేరు చేయగలిగిన భాగాన్ని మాత్రమే వెల్లడి చేయవచ్చు.

### ప్రభుత్వ సంస్థలు అంటే –

చట్టంలోని సెక్షన్ 2(బి) ప్రకారం ఏర్పడిన ఏ సంస్థ అయినా ప్రభుత్వ సంస్థ అవుతుంది.
రాజ్యాంగం ప్రకారం, పార్లమెంటు ద్వారా చట్టాల ప్రకారం, శాసన సభలు చేసిన చట్టాల ప్రకారం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్ల ద్వారా, అధిక మొత్తంలో ప్రభుత్వం నిధులు సమకూర్చిన సంస్థలు,

### సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత నుండి మినహాయించిన సంస్థలు

షెడ్యూలు 2 లో పేర్కొన్న కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు, భద్రత సంస్థలు, మత్తు పదార్థాల నియంత్రణ బ్యూరో, సెక్యూరిటీ సంస్థలు, పారా మిలటరీ సంస్థలు, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలచే మినహాయించబడే సంస్థలు. అయితే ఈ మినహాయింపులు వీటికి పూర్తిగా వర్తించవు. అవినీతి మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమస్యలలో సమాచారం అందించాలి కేంద్ర / రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమీషన్ అమోదంలోనే మానవ హక్కుల ఉల్లంఘనకు చెందిన సమాచారాన్ని ఇవి వెల్లడి చేయాలి.

### సమాచారాన్ని అందించడానికి ప్రభుత్వం చేయాల్సిన పనులు

చట్టం చేసిన 120 రోజుల లోపల ప్రభుత్వ సంస్థలు ఈ దిగువ అంశాలు ప్రచురించాలి.

- సంస్థల వివరాలు, విధులు బాధ్యతలు.
- సంస్థలలోని అధికారులు, సిబ్బంది అధికారాలు, బాధ్యతలు.
- నిర్ణయాలు తీసుకునే విధానం, పర్యవేక్షణ, జవాబుదారీతనం వివరాలు.

### విధులు నిర్వర్తించడానికి రూపొందించుకున్న నియమాలు

- సిబ్బంది తమ విధులు నిర్వర్తించడానికి ఉపయోగించే నియమ, నిబంధనలు, ఆదేశాలు, మాన్యువల్స్, రికార్డులు.
- సంస్థ ఆధీనంలో ఉండే పత్రాల వర్గీకరణలో కూడిన వివరాలు.
- విధి విధానం రూపొందించేటప్పుడు, దానిని అమలు చేసేటప్పుడు ప్రజలతో సంప్రదించేందుకు లేదా ప్రజా ప్రతినిధులను తీసుకునేందుకు ఉన్న ఏర్పాట్లు.
- సంస్థ ద్వారా ఏర్పాటు చేయబడిన ఇద్దరుకంటే ఎక్కువ సభ్యులు ఉండే బోర్డు సంఘం, కమిటీవంటి జాబితా, వీటి సమావేశాలకు ప్రజలు హాజరయ్యే అవకాశం, వాటి సమావేశాల మినిట్స్ ప్రజలకు అందుబాటులో ఉండే విషయం కూడా తెలియజేయాలి.
- సంస్థలోని అధికారులు, సిబ్బంది డైరక్టరీ.
- అధికారులు, సిబ్బందికి నెలవారీ చెల్లించే జీతం, సంస్థ నిబంధనల ప్రకారం వారికి సమకూర్చే ఇతర సదుపాయాలు.
- ప్రతి ఏజన్సీకి కేటాయించిన నిధులు, అన్ని ప్రణాళికల వివరాలు, ప్రతి పాదించిన ఖర్చులు, పంచిపెట్టిన మొత్తాలు.
- సబ్సిడీతో కూడిన కార్యక్రమాల అమలు విధానం వాటికి కేటాయించిన మొత్తాలు, వీటి లబ్ధిదారులు.
- సంస్థ అనుమతి ఇచ్చిన కనెక్షన్లు, గ్రాంట్లు, ఆథరైజేషన్లు పొందిన వివరాలు.
- ఎలక్ట్రానిక్ రూపంలో సంస్థకు అందుబాటులో నియంత్రణలో ఉన్న సమాచారం.
- సమాచారం పొందటానికి పౌరులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల వివరాలు. ప్రజలకోసం గ్రంథాలయం లేదా రీడింగ్ రూము నిర్వహిస్తూ ఉంటే, అవి తెరచి ఉంచే వేళలు.
- పౌర సమాచార అధికారుల పేర్లు. హోదా, ఇతర వివరాలు సెక్షన్ 4(1) (బి) ప్రకారం.

(మిగతా సమాచారం వచ్చే సంచికలో)

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు – ఎకాలజి**

## నీతి వాక్యం :

అ॥ గుణమగుణంబు దైవక్రియ గోరి యొనర్పఁగఁ బూను పండితా
గ్రణి మునుమున్నె సేయఁదగు కర్మము పాకము నిశ్చయించి ని
ర్వ్రణమతి చేయఁజెల్లు ; శుభ వర్త్రియ లెంచక చేసినన్, దదు
ల్బణఫలమబ్బు దాఁకఁ గృతిపాకము హృద్గతినేర్పు శల్యమై.

– భర్తృహరి

### తాత్పర్యము:

మంచి పనిగాని, చెడ్డపనిగాని చేయాలనుకుంటే, వివేకవంతుడు ముందుగా లోతుపాతులను గూర్చి చక్కగా ఆలోచించాలి. అలా ఆలోచించకుండా త్వరపడి చేసే పనుల ప్రతిఫలం జీవితాంతం మనస్సును దహిస్తూ ముల్లులా బాధిస్తుంది.

### చర్చ :

ఏ పని చేసినా అది మంచిపని గావచ్చు లేదా సమాజం మెచ్చని పనిగావచ్చు. వివేకముగలవారు ముందుగా ఆలోచించి ఆ పని యొక్క ఫలితాల్ని గురించి, బేరీజు వేసుకోవాలని భర్తృహరి మనకు భోదిస్తున్నాడు. ప్రాణికోటి అంతటిలో, మనిషికి వివేచనాజ్ఞానం అదనం. ఈ వివేచన జ్ఞానం ఉపయోగించుకున్నవాడు మనిషవుతాడు. ఉపయోగించనివాడు పశుపక్ష్యాదులతో సమానం. ఇక్కడ భర్తృహరి మంచిపనిని చెడు పనిని సమానంగా గుర్తించినట్లు మనకు కనపడుతుంది. కానీ వాస్తవంగా పరిశీలిస్తే అదికాదు. ఒక్కోసారి సమాజహితవు కొరకు దండన కార్యక్రమం లేదా శిక్షించే కార్యక్రమం చేపట్టవచ్చు. శిక్షింపబడే వ్యక్తి చెడు అయినా అతని దుర్మార్గాల నుంచి సమాజానికి రక్షణ అవసరం కాబట్టి ఎక్కువ మంది క్షేమంకోసం ఒకరిద్దరు దుర్మార్గులను శిక్షించడం తప్పు కానట్టే, చెడుపనిని కూడా వివేచనతో చేయాలని ఈ సందర్భంగా భర్తృహరి మనకు హితబోధ చేస్తున్నాడు.

మంచికంటే చెడుకు ఎక్కువ ప్రచారం దొరుకుతుందన్న అభిప్రాయం సరి అయినదే అనిపిస్తుంది. అయినా, ఈ మధ్య కాలంలో చిన్న చిన్న అభిప్రాయబేధాలకు రాజకీయలబ్ధికి, వ్యక్తిగత అసూయలతో, ఆలోచన వివేచన లేకుండా మనుషుల ప్రాణాలు తీస్తున్నారు. రాబోయే పంచాయితీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని భార్యకు ఆరోగ్యం బాగులేక వైద్య చికిత్స కోసం పట్టణానికి వచ్చిన వ్యక్తిని భార్య ఎదుటే దారుణంగా నరికి చంపారు. దగ్గరి దారిలో ధనం సంపాదించే కాంక్షతో 3 సంవత్సరల బాలుణ్ణి కిడ్నాప్ చేయడం, తరువాత పోలీసుల జోక్యంతో వదిలివేయడం జరిగింది. ఇటీవల జరిగిన ఈ రెండు సంఘటనలు మనిషిలో ఉన్న వివేచనా శక్తికి భిన్నంగా జరిగినటువంటివి. ప్రాణం పోసే శక్తి లేనప్పుడు ప్రాణం తీసే హక్కు మనిషికి ఎవరిచ్చారు ? అసూయలు, రాజకీయ లబ్ధిలు ఇంతటి దారుణానికి దారి తీయడం ఎంతవరకూ సమంజసం. అదే విధంగా స్వశక్తిమీద ఆధారపడ్తూ సక్రమమైన జీవనం, నలుగురూ మెచ్చే జీవనం గడిపే బదులు, ప్రకృతిలోకెల్లా అత్యంత అందమైన ప్రాధాన్యత కలిగిన, అభం శుభం తెలియని పసిపిల్లల్ని కిడ్నాప్ చేయడం, వారిని హింసించడం మానవత్వం అనిపించుకుంటుందా ? ఎవరి కోసం ఈ హత్యలు, ఘోరాలు? ఒకరి జీవితంలో శోకం మిగిలిస్తే వారి జీవితాన్ని కూడా ఇవి కాటేయకుండా ఉంటాయా ? అందుకే వరుస హత్యల పరంపర. అలాగే ఇతరుల పిల్లలలో అమాయకత్వాన్ని, అనుభూతిని చూడలేనివాడు స్వంత పిల్లలలో ప్రేమను చూడగలడా ? అందుకే తెలివితేటలు పెరిగినా, ఆధునిక సౌకర్యాలు అనుభవించినా, సామాన్య అంశాలైన మానవ విలువలు, పాపపుణ్యాల్ని గౌరవించనివాడు పశువుకిందే లెక్క !

**వై.వి. మల్లారెడ్డి**

## మామిడిలో పిందె, కాయ రాలడం మెళకువలు

మామిడిలో పిందె, కాయ రాలటం ప్రధానమైన సమస్య. వివిధ దశలో పిందెలు, కాయలు, పిందె కట్టిన నాటి నుంచి కాయ కోత వరకు పలు కారణాలవల్ల మూడు దశల్లో రాలుతుంటాయి. మొదటిదశ పూత మొదలైనప్పటి నుంచి 5–6 వారాల వరకు ఉంటుంది. ఈ దశలో మగపువ్వులు, పరాగ సంపర్కం జరగని ఆడపువ్వులు, పిందవిచ్ఛిత్తి కల్గిన పిందెలు, చీడపీడలు ఆశించిన పిందెలు రాలుతాయి. దీనివలన చెట్టుకుగాని, రైతుకుగాని నష్టం ఉండదు. మొక్క శక్తికి అనుగుణంగా ఈ రకమైన రాలుడు ఉంటుంది. రెండవ దశ రాలుడులో, కొద్దిగా లేక సుమారుగా పెరిగిన పిందెలు రాలతాయి. ఈ రాలుడు ముఖ్య కారణాలు – 1) అధిక ఉష్ణోగ్రత, 2) పొడి వాతావరణం, 3) చెట్టు అంతర్గత పరిస్థితులు, 4) కాయల మధ్య పెరుగుతున్న పోటీవలన జరుగుతుంది. ఈ దశ ఏప్రిల్ – మే నెలల్లో ఉంటుంది. రాలుడువల్ల కొంత ఆర్థిక నష్టం ఉంటుంది.

ఇక మూడవ దశ, కాయ కోతకు 15–30 రోజులు ముందుగా ఉంటుంది. ఈ దశలో బాగా పెరిగి, కోతకు సిద్ధంగా ఉన్న కాయలు రాలటంవల్ల ఎక్కువ ఆర్థిక నష్టం జరుగుతుంది. ఈ దశలో గాలులు, వడగళ్ళు, అధిక ఉష్ణోగ్రత, పొడి వాతావరణం, బెట్ట పరిస్థితుల వల్ల, టెంకె పురుగు, పండుఈగ వల్ల కాయలు రాలుతాయి.

కారణాలు ఏవైనప్పటికీ పిందె, కాయ రాలడంవల్ల మామిడిలో ఆర్థిక నష్టం కలుగకుండా నివారించడం అవసరం.

### పిందె, కాయ రాలడం – నివారణ

మామిడిలో పిందె, కాయ రాలడం నివారించుటకు రైతులు దిగువ సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

1. పిందె దశ నుంచి కోతవరకు చెట్లకు 20–30 రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు నీటి తడులు ఇవ్వాలి. ఏప్రిల్‌లో రెండుసార్లు, మేలో ఒకసారి ఇవ్వాలి.
2. వర్షాధారపు తోటల్లో పెరుగుతున్న పిందెలమీద, కాయలమీద యూరియా (1–2 శాతం) పిచికారీ చేయాలి.
3. హార్మోన్‌లను పిచికారీ చేయాలి. ప్లానోఫిక్స్ (ఒక మి.లీ.ను 4.5 లీటర్ల నీటిలో) రెండుసార్లు పిచికారి చేయాలి. మొదటిసారి పిందెలు గోలీకాయ సైజులో ఉన్నప్పుడు, రెండవసారి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పిచికారి చేయాలి.
4. అదేవిధంగా 2, 4–డిని స్ప్రే చేయాలి. 2,4–డి–20 పి.పి.ఎమ్ పూత సమయంలో పిచికారి చేస్తే పిందె కట్టటం వృద్ధి చేస్తుంది. 2,4–డి 20 పి.పి.ఎమ్‌ను పూత వచ్చిన నెల తరువాత, పిందెలు గోలీకాయ సైజులో ఉన్నప్పుడు పిచికారి చేస్తే, వేసవికాలంలో జరిగే కాయరాలుడును నివారిస్తుంది. 2,4–డి 5 పి.పి.ఎంను కోతకు 20–30 రోజుల ముందు పిచికారి చేయుటవలన కాయ కోతకు ముందు కాయ రాలుడును నివారిస్తుంది.

# ఈ మాసంలో వ్యవసాయం

## రసాయనిక పురుగు మందులు
## విషపూరితం చేసేది, పైరుకు హాని చేసే పురుగులనా ? మనుషులనా ?

**రైతులారా మీకు తెలుసా !**

మీ ఆరోగ్యంపై రసాయన పురుగు మందులు ఎన్నో రకాల దుష్ప్రభావాలు కలుగజేస్తాయి. వీటి తీవ్ర విషప్రభావానికి గురై పురుగు మందులు వాడేవారు వెంటనే చనిపోవచ్చు. దీర్ఘకాల విషప్రభావం ఎన్నో జబ్బుల, వ్యాధుల రూపంలో ప్రాణాలను హరించవచ్చు. దీనిలో క్యాన్సర్ వంటి రోగాలు కూడా ఉన్నాయి. ఈ రసాయన పురుగు మందులు, నేలను, నీటిని, కలుషితం చేస్తాయి. పర్యావరణానికి మిక్కిలి హాని కలుగజేస్తాయి. ఇన్ని చెడులు చేసే రసాయన పురుగు మందులు మానేసి - జీవ క్రిమికీటక నాశనులను తయారు చేసుకొని ప్రకృతి సిద్ధ పద్ధతుల్లో సస్యరక్షణ చేపట్టండి. జీవక్రిమినాశనులు ఏమనగా - వేప గింజల కషాయం, వేపనూనె, వేపచెక్క, పొగాకు కషాయం, పచ్చిమిర్చి, వెల్లుల్లి ద్రావణం, పశువుల పేడ - మూత్ర ద్రావణం, పశువుల పేడ, మూత్రం - ఇంగువ కషాయం, వావిలాకు కషాయం. కానుగ పప్పు కషాయం మరియు ఎన్.పి.వి. వైరస్ కషాయం.

పై నాశనులను మనకు అందుబాటులో ఉండే పదార్థాలతో, తక్కువ ఖర్చులో తయారు చేసుకొని ఇప్పటి నుండైనా పురుగులను, తెగుళ్ళను నియంత్రించుకొని, పర్యావరణానికి, మనుషులకు, పశువులకు, పక్షులకు హాని జరుగకుండా చూసుకుందాం.

### వేప కషాయం తయారు చేయు పద్ధతి :

- పండి రాలిన వేప పళ్ళను మే, జూన్ నెలలో సేకరించాలి, వేప పండ్లను నీడలో 4/5 రోజుల వరకు ఆరనివ్వాలి.
- వేప పండ్లను ఎండలో ఆరబెట్టరాదు. బాగా ఆరిన / ఎండిన వేప పండ్లను మిల్లుమరలో వేసి పొడి చేయించుకొని, గోనె సంచులలో నిల్వ చేసుకోవాలి. పాలిథిన్ సంచులలో నిల్వ చేయరాదు.
- 10-15 రోజుల వేప పండ్లను పల్చటి గుడ్డలో మూటకట్టి 10-12 గంటలు ఒక బక్కెట్ నీటిలో నానబెట్టాలి.
- బాగా నానిన తరువాత నీటిలో మూటను ముంచి పట్టుకొని పలుమార్లు కషాయాన్ని పిండాలి.
- పై విధంగా వచ్చిన ద్రావణాన్ని గుడ్డలో వడబోసి 100 గ్రాముల సబ్బుపొడి కలపాలి.
- ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో ఉన్న పైరుపై, పిచికారి చేసుకోవాలి.
- పంట దశను బట్టి 5 శాతం ద్రావణము తయారు చేసుకొని పిచికారి చేయాలి.
- పంట దశను బట్టి పురుగుల ఉధృతిని బట్టి మోతాదు పెంచుకోవలసి ఉంటుంది.
- వేప గింజల పొడి, కషాయం పిచికారి చేయుటవలన లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు, నామాల పురుగు, ఆకుముడత పురుగు, ఆకులను నమిలి తినే పురుగులు మరియు రసం పీల్చు పురుగులను నియంత్రించవచ్చు.

### వేప గింజల కషాయం పనిచేసే విధానం.

- పురుగు గుడ్డు పెట్టినపుడు పిచికారి చేస్తే గుడ్డు పొదగకుండా మురిగిపోతుంది.
- పురుగు నష్టపరుస్తున్న దశలో వేప కషాయం పిచికారి చేయుటవలన అందలి చేదు వలన పురుగు ఆహారం తినడం మానివేసి నెమ్మదిగా చనిపోతుంది.
- లార్వాదశలో పురుగు ఒక దశ నుంచి ఇంకొక దశకు పెరగనీయకుండా చేస్తుంది.
- నిద్రావస్థ దశలో ప్యూపా నుండి రెక్కల పురుగు వెలువడదు.
- పంట పూత దశలో పిచికారి చేస్తే రెక్కల పురుగులు, వేప వాసనతో పంటపై గుడ్లను పెట్టవు.
- గుడ్డు మరియు పిల్ల పురుగు దశలలో వేప ద్రావణం చల్లిన ఆకులు చేదుగా ఉండడం వలన పిల్ల పురుగులు ఆకులను తినలేవు. వేపలో "అజాడిరెక్టిన్" అనే పదార్థంవలన పురుగు జీవిత చక్రము పూర్తి చేయలేక లార్వాగానే నిద్రావస్థలోనే చనిపోతుంది.
- వేప ద్రావణం మనుషుల ఆరోగ్యానికిగాని, మేలుచేసే పురుగులకుగాని, వాతావరణానికిగాని హాని చేయదు.
- వేప ద్రావణంలో ఉన్న అనేక 'ఫ్లేవోనాయిడ్స్' పంటను ఆరోగ్యవంతంగా ఉంచడానికి సహాయపడతాయి.
- ఇన్ని సుగుణాలు కలిగిన వేప గింజల పొడి తయారుకు రైతు సోదరులు ప్రతి ఒక్కరు రాబోవు వేప పండ్ల (మే, జూన్, మే లలు) కాలములో వేప పండ్లను సేకరించి నీడలో ఆరబెట్టి పొడి చేసి పెట్టుకొని అవసరం మేరకు ఉపయోగించుకొనవలసినదిగా కోరుచున్నాము.



ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990